క్లుప్తంగా...

కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో గత కొన్నేళ్లుగా వివిధ హోదాల్లో సేవలందించి బదిలీపై వెళుతున్న పలువురు పోలీసు సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఓయూ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న కానిస్టేబుళ్లు వినయ్, గణేష్, ప్రియాంక, సంతోష్, హెడ్ కానిస్టేబుల్ మల్లన్న, కేశవరెడ్డి, కృష్ణదేవ్ తదితరులను శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఓయూ పీఎస్‌కు బదిలీపై వచ్చిన సిబ్బందికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మీనారాయణ, రవి, భార్గవి, శాంతి కుమార్, నోవా, బిక్షం, రాజేంద్రన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

లాలాపేట: ఓబీసీల గోస..బీజేపీ భరోసా పేరుతో నిర్వహించనున్న సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సికింద్రాబాద్ నియోజకవర్గ ఓబీసీ జనరల్ సెక్రటరీ సుక్క గణేష్ రావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న నాలోల్‌లోని శుభం గార్డెన్స్‌లో జరిగే సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు లాలాపేటలో మహంకాళి జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించామన్నారు. మహంకాళి జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అమీర్‌పేట: డెంగీ వ్యాధి భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు. జాతీయ డెంగీ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖైరతాబాద్ సర్కిల్–17 ఎంటమాలజీ సిబ్బంది, సనత్‌నగర్ ప్రాథమిక ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

చలువాదికి తలసాని నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయ ఫౌండర్ సభ్యుల్లో ఒకరైన చలువాది నారాయణ మృతి పట్ల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సంతాపం తెలిపారు. నారాయణ మృతిపై సమాచారం అందడంతో ఆయన మంగళవారం సోమసుందరం వీధిలోని చలువాది ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ కోళికె కిరణ్మయి, నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, కిశోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మహిళా రెజ్లర్స్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజేష్ భూషణ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని సుందరయ్య పార్కు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ భూషణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ.. 'ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్స్ నిరసన తెలుపుతుంటే కేంద్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని విమర్శించారు. వారి పోరాటాలకు మద్దతుగా కిసాన్ సంయుక్త మోర్చా ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు పశ్య పద్మ, ప్రభాకర్, వెంకటయ్య, బిక్షపతి, శోభన్ నాయక్, వెంకట్రాములు, ధర్మానాయక్, అరుణజ్యోతి, నాగయ్య, స్కైలాబ్ బాబు, శ్రీరాం నాయక్, విజయ్, ప్రదీప్, రాంబాబు తదితరులున్నారు.

కాచిగూడ: భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపించి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం నారాయణగూడలో సంతకాల సేకరణ చేపట్టారు. భారత జాతీయ మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి ప్రతినిధులు ఎస్.ఛాయాదేవి, నళిని, షహనా అంజుమ్, శ్రీదేవి తదితరులున్నారు.

పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గ పరిధిలో నూతన పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలోని తన ఛాంబర్‌లో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పోలీసు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గాంధీనగర్, గోపాలపురం, బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్ల భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని, విశాలమైన భవన నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన స్థలాన్ని సేకరించి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం సకల సౌకర్యాలతో నూతన పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్ భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరాయని, మరికొన్నింటిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ కార్యాలయాలను తలపించేలా నూతన పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పర్యవేక్షణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.84 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం మరికొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. కోటి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కెమెరాల పనితీరు, నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సీఎస్ఆర్ ఫండ్, దాతలు, కాలనీ అసోసియేషన్ల భాగస్వామ్యంతో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం జూన్ 20న నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. జులై 9న మహంకాళి అమ్మవారి బోనాల జాతర దృష్ట్యా ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం లేదని, అందుకు కృషి చేస్తున్న పోలీసు శాఖ అధికారులను మంత్రి ప్రశంసించారు. సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ చందనాదీప్తి, ఏసీపీలు పృథ్వీధర్‌రావు, రమేష్, సుధీర్, యాదగిరి, మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కావేటి శ్రీనివాసులు, లింగేశ్వర్, నేతాజీ, నరేష్, మోహన్‌రావు, సైదులు, ముత్తుయాదవ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పులి కల్పన

అడ్డగుట్ట: గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించడంతో పాటు పట్టణ పేదలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఈ మేరకు మంగళవారం అడ్డగుట్ట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పులి కల్పన మాట్లాడుతూ ఎన్‌డీఏ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎత్తివేయాలని కుట్ర పన్నుతోందన్నారు. పనులు జరుగుతున్న గ్రామాలను నగర పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి పట్టణం పేరుతో వారికి ఉపాధి చేపడం లేదన్నారు. పట్టణ పేదలకు ఉపాధి పని కల్పించాలన్న ధ్యాస కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోవడం దారుణమన్నారు. చేసిన పనికి చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వకుండా అరకొరగా ఇస్తున్నారని ఆరోపించారు. కేరళ తరహాలో పట్టణ పేదలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం దశలవారీగా జరుగుతున్న ఆందోళనలు, పోరాటాల్లో కూలీలు, ప్రజా సంఘాలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు రేవతి, లక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ సమస్యను పరిష్కరించండి



వాటర్‌వర్క్స్ టెక్నికల్ డైరెక్టర్ అజ్మీరా కృష్ణకు సమస్యలు వివరిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: నియోజకవర్గ పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సివరేజీ సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన వాటర్‌వర్క్స్ టెక్నికల్ డైరెక్టర్ అజ్మీర కృష్ణతో సమావేశమయ్యారు. కార్పొరేటర్లు దీపిక, సుచిత్రతో కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మోండా, రాంగోపాల్‌పేట, అమీర్‌పేట్, సనత్‌నగర్ డివిజన్లలో డ్రైనేజీ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సికింద్రాబాద్ గురుద్వారా వద్ద కళాసిగూడ మెయిన్ డూప్లికేట్ ధ్వంసమైనా పట్టించుకోవడం లేదన్నారు. రూ.5 కోట్లతో అమీర్‌పేటలో ఏర్పాటు చేసిన కే–51 మెయిన్ పైప్ లైన్ పనులను పునరుద్ధరించడం లేదని, స్థానికంగా ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: ఐక్యరాజ్యసమితి రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బేగంపేటలోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో మంగళవారం రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ శంకర్‌రాజు పర్యవేక్షణలో టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రహదారి భద్రతపై వివరించారు. ఈ సందర్భంగా నారాయణ మహా విద్యాలయ విద్యార్థులకు రహదారి భద్రతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

శ్రీశక్తి కళాశాలలో..

బేగంపేటలోని శ్రీశక్తి హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే తీసుకునే చర్యలను వివరించారు. 2022లో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 75,348 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, హెల్మెట్లు, సీటు బెల్టులు ధరించకుండా డ్రైవింగ్, ట్రాఫిక్ సిగ్నళ్లను పాటించకుండా డ్రైవింగ్ చేయడం చేయడం వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

నేడు బ్రాహ్మణ సంఘాల సమావేశం



కేవీ రమణాచారిని సన్మానిస్తున్న రవీంద్రాచార్యులు

సనత్‌నగర్: బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం బ్రాహ్మణ సంఘాల సమావేశం నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు తెలిపారు. సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవస్థానం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమ సంఘం పరిషత్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో ఈ నెల 31న బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవం, ఉద్యోగులతో సమానంగా అర్చకులకు వేతనాలకు ఇస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశానికి అన్ని అర్చక సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో గంగు ఉపేంద్రశర్మ, చింతపట్ల బద్రీనాథాచార్యులు, కాండూరి కృష్ణమాచార్యులు, అగ్నిహోత్రం చంద్రశేఖర్‌శర్మ, కృష్ణమాచార్యులు, రిపుంజయశర్మ తదితరులు పాల్గొన్నారు.

భారీగా మద్యం సీసాలు స్వాధీనం

ముగ్గురి అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో : హర్యానాలోని హిస్సార్ నుంచి 87 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగం సూపరింటెండెంట్ ఎస్. అంజిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి నేతృత్వంలో ఎక్సైజ్ పోలీసులు సికింద్రాబాద్ స్టేషన్‌లో 5వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆగిన హిస్సార్ సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ అటెండర్లుగా పని చేస్తున్న ఖమ్మం పట్టణానికి చెందిన అన్వేష్ , వరంగల్‌కు చెందిన అన్వేష్, హన్మకొండకు చెందిన బాలక్రిష్ణ నుంచి 87 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు హిస్సార్ నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి హైదరాబాద్, వరంగల్‌లో విక్రయిస్తున్నట్లు అంజిరెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్..

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



అడ్డగుట్ట: అనారోగ్యంతో బాధపడుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మెట్టుగూడలోని పిల్లర్ నెం. 1108 వద్ద ఫుట్‌పాత్‌పై దాదాపు 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గుర్తించిన పెట్రోలింగ్ పోలీసులు అతడిని లేపేందుకు ప్రయత్నించగా స్పందన లేకపోవడంతో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై ఆకుపచ్చ, బూడిద రంగు టీషర్ట్, బూడిద రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ వేసుకొని ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన రంజిత్ కుమార్

సికింద్రాబాద్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన రంజిత్ కుమార్ మేస్త్రీగా పని చేస్తుంటాడు. మంగళవారం ఉదయం అతను మౌలాలి–చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలోని పట్టాల పక్కనుంచి నడిచి వెళుతుండగా వెనక నుంచి వచ్చిన రైలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



అమీర్‌పేట: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలి లా ఉన్నాయి. ఈ నెల 6న ఎర్రగడ్డ మానసిక వైద్య ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీ భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధీకులు ఎస్ఆర్‌నగర్‌లో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రసూల్‌పురా: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వినయ్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లాకు చెందిన రాజు, భార్య స్వరూప ఇద్దరు పిల్లలతో కలిసి నగరానికి వలస వచ్చి పికెట్ గాంధీ హట్స్ బస్తీలో నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసైన రాజు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మంగళవారం రాత్రి భార్యభర్తల మధ్య వాగ్వాదం జరగడంతో మనస్తాపానికిలోనైన రాజు బెడ్రూమ్‌లో కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి



సమావేశంలో పాల్గొన్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

అడ్డగుట్ట: బడీడు పిల్లలనందరినీ బడుల్లో చేర్పించేందుకు అందరూ కృషి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారేడుపల్లి మండల పరిధిలో 178 మంది చిన్నారులు బాల కార్మికులుగా మారి తమ హక్కులను కోల్పోతున్నారన్నారు. వచ్చే నెలలో బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టి బడులకు దూరంగా ఉన్న పిల్లలందరినీ బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండల పరిధిలో మూడు రెమిడియల్ సెంటర్లు కొనసాగుతున్నాయని, ఆయా సెంటర్లకు పిల్లలందరినీ పంపించే బాధ్యత సీఆర్పీఎఫ్ సభ్యులు, తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. మాంగర్ బస్తీ, అంబేద్కర్ నగర్, రవీంద్రనగర్, ఏసీఎస్ నగర్, చంద్రబాబు నాయుడు నగర్ బస్తీల్లో పిల్లల చేత మద్యం విక్రయాలు చేయిస్తున్నారన్నారు. తక్షణమే వాటిని అరికట్టకపోతే పిల్లల భవిష్యత్తుకే ప్రమాదమన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలపై 1098, 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. సమావేశంలో సీఆర్పీఎఫ్ సభ్యులు ప్రవీణ్, హరి, రమేష్, నర్సింగ్ రావు, రామలీల, జహంగీర్, సురేష్, కుమారి, ఎంవి ఫౌండేషన్ ఆర్గనైజర్ సువర్ణ, రెమెడియల్ టీచర్స్ సుమలత, లావణ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణపై అవగాహన కల్పించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ అమర్‌సింగ్

రాంగోపాల్‌పేట్: వర్షాకాలం ప్రారంభం కాక ముందే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, బస్తీ దవాఖానాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు డెంగీ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్యాట్నీ సెంటర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో జిల్లాలో పెద్ద సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు డెంగీ వ్యాధి వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో సైతం కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించడమే కాకుండా ఆచరించేలా చూడాలన్నారు. నీరు నిలువ ఉండకుండా చూడాలని, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి వారానికోసారి ఫాగింగ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ అనురాధ, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ రాజేంద్రకుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా అధికారి నిరంజన్, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారులు నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: రేషన్ దుకాణాలకు వచ్చే వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. మంగళవారం అడ్డగుట్టలోని పలు రేషన్ దుకాణాల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ డీలర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీను, అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారిణి సరస్వతి, ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్, బీఆర్ఎస్ నేతలు ఇస్మాయిల్, గౌస్, నర్సింగ్, రవి, నరేష్, రాజు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్' ను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గాజుల హంసరాజ్ అన్నారు. మంగళవారం తుకారాంగేట్, వెంకట్‌నగర్‌లో ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఇందులో రిజిస్టర్ చేసుకున్న వారికి ఉచితంగా రూ. 5 లక్షల ఆరోగ్య బీమా లభిస్తుందని తెలిపారు. కార్డు పొందిన వారు దేశంలో ఎక్కడైనా ఉచితంగా వైద్య సదుపాయం పొందే అవకాశం ఉందన్నారు. బుధవారం కూడా వెంకట్‌నగర్‌లో రిజిస్ట్రేషన్ కొనసాగుతుందని, ప్రజలందరూ తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకట స్వామి, లక్ష్మణ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో చెత్త డంపింగ్ వాహనం ప్రారంభం



చెత్త డంపింగ్ ఈవీ వాహనాన్ని ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో పారిశుద్ధ్య సేవలను మరింత మెరుగుపరచి, చికిత్స పొందుతున్న రోగులకు త్వరితగతిన స్వస్థత చేకూర్చేందుకు కృషి చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు అన్నారు. జీడీఎక్స్ శానిటేషన్ నిర్వహణ సంస్థ రూ.3.5 లక్షలతో కొనుగోలు చేసిన చెత్త డంపింగ్ ఈవీ వాహనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగుల రద్దీ, ఆస్పత్రి అవసరాలకు అనుగుణంగా పారిశుద్ధ్య సేవలను మెరుగుపరుస్తున్నామని, ఈవీ వాహనంతో ర్యాంప్‌పై ఎనిమిది అంతస్తుల్లోని అన్ని విభాగాలకు వెళ్లి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించడం సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వెంకటరమణ, రాము, యోగేందర్, విజయ, కార్తీక్, జీడీఎక్స్ సంస్థ నిర్వాహకులు రవికుమార్, శివాజీ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.లింబాద్రికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి ఓయూ పరిశోధన విద్యార్థులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పరిశోధన విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రొ.లింబాద్రికి వివరించి, ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజును తగ్గించాలని, ప్రైవేటు రీసెర్చ్ సెంటర్లను రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆజద్, అఖిల్, యాదగిరి, మహేష్, జయప్రకాష్, శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.